# బుద్ధుడు పుట్టిన భూమిలో!...

మిట్ట మధ్యాహ్నం. ఎంత తెంపినా తెగని నేల అనుబంధంతో మట్టిని బువ్వగా మార్చే ప్రయత్నంలో సతమతమవుతున్న ఎముకల గూళ్లపై దండెత్తడానికి మిడిసి పడ్తూ ఉంది ఎండ!

"దీని కడుపు మండ. దీనికేం పొయ్యేకాల మొచ్చిందో?- మిడ్సి మిడ్సి పడ్తా మాడు పగలగొట్టా ఉండాదే?" అని నిట్టూరుస్తూనే మట్టికి చెమటతో మర్యాదలు చేస్తూ ఉంది రైతాంగం!

మిద్దింటోళ్ల కోడలు మీనాక్షి మిద్దింటికే కాదు ఊరికంతా ముద్దే!

ఇంట్లో చేదబావి ఎండిపోతే వీధి బావికి వచ్చింది. అదిగూడా అడుగంటింది. ఆ అడుగంటిన బావిలో చేదవిడిచింది. దుత్త మునిగినంత మునగ్గా దోర్చి దోర్చిచేదుకొనింది. నిండిన బిందెనెత్తి చంకన పెట్టింది. వీధిలో నడుస్తూ ఉంది వయ్యారంగా!

ఎండిన పైర్లకు ఏతామెత్తిన వాళ్లు...కోడిపుంజులకు కూతలు నేర్పి లోతు బావుల్లో ఓర్పును పరీక్షించుకొన్న వాళ్లు...పదును లేని కయ్యల్లో డొక్కలెండిన దుక్కిటెద్దుల శ్రమను చెమటతో సేదదీర్చిన వాళ్లూ - కడుపులకింత కవళం వేసుకొందామని ఇంటి ముఖం పట్టి వీధుల్లో అడుగు పెట్టారు.

మీనాక్షి నడివీధిలో నిలబడింది!

ఒక్కసారి చుట్టూ కలయ చూసింది. చంకలో బిందెను చేతుల్లోకి తీసుకొనింది. అమాంతంగా పైకెత్తి గబగబ నెత్తిన కుమ్మరించుకొనింది. నడి మిట్ట మీద సూర్యుడు కక్కుతున్న నిప్పుల్ని కన్నుల్తో చెరుగుతూ తలను ఒక్క విసురు విసిరింది!

చేతిలో బిందె మూడు బారల కవతల పడి మూలిగింది.

కురులు చెదిరాయి. కుంకుమ చెదిరింది. పైట జారింది. తడిగుడ్డల్లో సొగసు నిగనిగలాడుతున్న ఎండలో ఎగసెగసి పడుతూ ఉంటే...సుడిగాలిలో చిక్కిన లతలా సుళ్లు

తిరుగుతూ "ఒరే! నేను ముత్యాలమ్మనురా!" అని గావుకేక పెట్టింది. ఆ కేకతోకూడా పరుగందుకొనింది. వీధి వీధి తిరిగింది. ఆ ఊపుమీదనే ఉరి గెవిన్లో పోతరాజు గుడిలో దూరింది. త్రిశూలాన్ని చేతికందుకొనింది. కనుగుడ్లు తేలేసి...నాలుకను బయటికి నెట్టి...వెనక్కూ ముందుకూ ఊగుతూ వెంటపడ్డ జనాన్ని చూసి "నన్నే మరచి పోతారంట్రా?' అని హుంకరించింది.

పొలంపనుల్లో నుండి అప్పుడే వీధుల్లో అడుగు పెట్టిన రైతులు ...ఇండ్లల్లో అమ్మలక్కలు ఊరు ఊరంతా ఒక్కటై 'ముత్యాలమ్మ' వెంటపడి 'మా తప్పుల్ని మన్నించు తల్లీ!' అని కర్పూర హారతులిచ్చింది. నిమ్మకాయలతో దిష్టితీసింది. టెంకాయలు కొట్టి దిగదీసింది.

ముత్యాలమ్మ శాంతించింది!

తప్పెట మీద దెబ్బ పడింది. ఏడూళ్లు ఏకమయ్యాయి.

అది భయం కావచ్చు. భక్తికావచ్చు. ఏడూళ్ల కాకితో కబురందుకొన్నట్లుగా ఎకాఎకిని ఏకమైన మాట మాత్రం వాస్తవం. ముత్యాలమ్మ పూనకం కూలోడి కోడలు మీద కావచ్చు. కుమ్మర బుడ్డయ్య కోడలు మీద కావచ్చు. అలా జరిగితే ముత్యాలమ్మ ప్రతిష్ఠ ఏమై పోవాలి? అందుకే ముత్యాలమ్మ కలిగినింటి కోడలి మీదనే పూనింది.

ఆరోజు...

ఊరూరుగా కుశాల కుళ్లాయిలను ఎత్తి నెత్తిన బెట్టుకొని ఉత్సాహం ఉరకలు వేస్తుంటే సంబరాల పల్లకీ లెక్క ఊరేగుతూ 'ఎప్పుడు పొద్దు కుంకుతుందా? మరెప్పుడు తెల్లారుతుందా?'అని వెయ్యిన్కొక్క కన్నుల్తో ఎదురు చూస్తుంటే 'పొద్దుగూట్లో పడ్తే ఎట్టబ్బా?... పొద్దు మొలిస్తే ఎట్టబ్బా?'అని రాముడుమాత్రం తనలో తానుకుళ్లుతూ కుములుతూ తుళ్లితుళ్లి పడబోతున్న కన్నీళ్లను అతికష్టం మీద అపుకొంటూ నెత్తిన చేతులు పెట్టుకొని కూర్చోలేదుకానీ తన పని మాత్రం తాను చేసుకొంటున్నాడు యాంత్రికంగా...కర్మ యోగిలా మౌనంగా!...

రాముడు రెడ్డోరింట్లో సేద్యగాడు.

రెడ్డోరిల్లు మునిరెడ్డిగారి ఊళ్లో ఉంది. ఆఊరి చుట్టూ ఎంచినట్టు ఏడూళ్లూ ఉన్నాయి.

ఆ పల్లెల కన్నిటికీ తల మునిరెడ్డిగారి ఊరైతే...ఆ ఊరికి తల తమ్మిరెడ్డి!

ఆ తమ్మిరెడ్డిగారిల్లే రెడ్డోరిల్లు!

ఆ రెడ్డోరింట్లో సేద్యగాడే రాముడు.

రాముడు రెడ్డోరింటిముందు పందిరిమీద కూర్చున్నాడు. అది ఆరు నెలలకిందట ఊళ్లో భారతోత్సవాలు జరుగుతున్నప్పుడు వేసిన పందిరి. ఆకు ఎండకు గలగలా ఎండింది. ఏమాత్రం గాలివీచినా ఆకు పలపలా పందిరికింద రాలుతూ ఉంది. రాముడు ఆ

ఆకునంతా సుద్దంగా తీసి పారేశాడు. అడ్డకొయ్యల్ని నిలువు వాసాల్ని బిగదీసి కట్టాడు. పెద్దతోపులో నరికి తెచ్చిన నేరేడాకు! నవనవలాడుతున్న ఆకును ఆ ఇంట్లో పాచిపన్లు చేసే చెంగి మంగి ఒక్కొక్కమండగా తీసుకొని బాణాల్లా పైకి విసురుతూ ఉంటే వాటిని అతి లాఘవంగా పట్టుకొని పందిరిమీద దట్టంగా పరిచాడు. గాలికి ఎగిరిపోకుండా పెండెవేసి కట్టాడు. పందిరి ఏమాత్రం ఎండపొడ కిందపడకుండా తయారయింది. ఒక్కసారి పందిరివైపు కలయజూసి తృప్తిగా నిట్టూర్చాడు. రాతికూసాలమీదుగా ఉడతలా కిందికి పాకుతూ పడమటి దిక్కును చూశాడు. నాలుగు బార్ల పొద్దు మాత్రమే ఉంది. ఆ నాలుగు బార్ల పొద్దు కుంకితే? ...కుంకిన పొద్దు మొలిస్తే?...

రాముడి గుండె గుభిక్కుమనింది!

గుభిక్ మన్న గుండెను గుప్పెట్లో కుదురుగా పట్టుకొని గడపలకు మామిడాకు తోరణాలు కట్టాడు. నిలువెత్తు పందిరి రాతి కూసాలకు టెంకాయమట్టల్ని ఆనించి ఆకుల్ని కూసాలచుట్టూ జడ అల్లినట్లు అల్లుతున్నాడు. అల్లుతున్నాడన్న మాటేకానీ వాడి మనస్సు మనసులో లేదు.

వాడి మనస్సంతా బుజ్జిగాడి మీదే ఉంది!

రాముడి మనస్సు బుజ్జిగాడి మీద పడి కొటకలాడుతూ ఉంటే...ఊరి మనస్సు ఆ మరునాడు జరిగే ముత్యాలమ్మ తిరుణాల చుట్టూ తిరుగుతూ ఉంది.

ముత్యాలమ్మకు పొంగళ్లు పెట్టడానికి మునిరెడ్డి గారి ఊరు చాలా ముంపుమీద ఉంది!

ఆ ఊరికి పడమరగా ఒక బోడి గుట్ట. ఆ గుట్ట కిందగా...ఊరికి నైరుతీ మూలగా... ఆ చుట్టు ప్రక్కల పల్లెలన్నిటికి అందుబాటుగా ముత్యాలమ్మ గుడి!

ఒక వేప మాను. ఒక రాగి మాను. ఒక దాన్నొకటి పెనవేసుకొన్నాయి-ఎంతో గాఢంగా. ఎంత కాలమైందో ఏమో కానీ ఒక దాని కౌగిట్లో ఇంకొకటి గాఢాలింగనంలో తాదాత్మ్యం చెందిన ప్రేయసీ ప్రియుల్లా కలిసిపోయాయి. ఆచెట్ల చుట్టూ మొండి గోడలు. బోదెల కింద కోడి గుడ్డు ఆకారంలో మూడు మోకాటెత్తు రాళ్లు! పసుపు పూసి కుంకుమ బొట్లు పెడితే ముత్యాలమ్మ తల్లి!

చినుకు నేల రాలకపోవచ్చు. చిన్నబిడ్డల్ని జ్వరాలు పట్టి పీడించవచ్చు. ఏ ఊళ్ళో అయినా కలరా వచ్చి మనుషులను కలవర పెట్టచ్చు. గొడ్డూ గోదకు తిరుగులేని రోగాలే రావచ్చు. ఏవైద్య సదుపాయాలకు నోచుకోని ఆ మారుమూల పల్లె కొంపల్లో ఇది సహజం.

ఈ సహజత్వానికి చాలా తెలివిగా మతపరమైన మూఢ నమ్మకాన్ని పులిమి రాజకీయం చేస్తుంది తమ్మిరెడ్డి కోడలు మీనాక్షి ముత్యాలమ్మ కోపంతో ముడేసి! రెడ్డోరింటి దర్పమూ దర్జా జ్ఞాపకాల్లో మిగల్చడానికి!

ఆ ఏడు ముత్యాలమ్మ తిరణాల జరిపించడానికి అపాయకట్టు ఉరుకులు

పరుగులందుకొనింది. ఆ మరునాడు పొంగళ్లు పెట్టడానికి ఏపల్లె కాపల్లె ఎంతో సంబరంగా'ఎప్పుడు పొద్దు కుంకుతుందా? ఇంకెప్పుడు తెల్లారుందా?' అని ఎంతో ఆశగా ఎదురు చూస్తుంటే రాముడు మాత్రం 'పొద్దు కుంకితే ఎట్లబ్బా?...కుంకిన పొద్దు మొలిస్తే ఎట్లబ్బా?' అని తనలో తాను తపించిపోతున్నాడు.

ఊళ్లో వాళ్లు ఉలికి ఉలికి పడుతున్నారు.

ఇదంతా పట్టించుకోని పొద్దు గూట్లో పడింది.

ఉన్నవాళ్ల ఇండ్ల వసారాల్లో లాంతర్లు వెలిగాయి. నట్టిండ్లలో నూనె దీపాలు అందమైన జడల్లో పూవుల్లా వెలుగుతున్నాయి.

పాతరైలు పెట్టెలాంటి పూరి కొంపల్లో కోడిగుడ్డు బుడ్డీ దీపాలు మినీరైలుపొగల్ని కక్కుతూ ఆ బతుకుల్లో ఆ మాత్రం వెలుగు నింపడానిక్కూడా ఆయాస పడుతున్నాయి.

ఈ దెబ్బతో ఊరిమీద దండెత్తిన చీకటి తోక ముడిచింది.

అయితే రాముడి గుండెల్లో చేరి తోక ఝాడించింది.

ఇంకొకప్పుడైతే ముచ్చటపడి శ్రద్ధగా ముస్తాబు చేస్తే పెండ్లి కూతురులా తయారైన రెడ్డోరింటిని తేరిపార చూసి 'ఇదంతా నా పనితనమే' అని మురిసి పోయేవాడు రాముడు. కానీ ఈపూట వాడి మనస్సులో మనసులేదు. మనస్సంతా బుజ్జిగాడి మీదే ఉంది. బుజ్జిగాణ్ణి తలుచుకుంటే రాముడి గుండెల్లో గునపాలు గుచ్చినట్లవుతూ ఉంది.

"అవును! బుజ్జిగాణ్ణి తప్పిస్తే నాకెవురున్నారు? పుట్టతానే తల్లి పొయ్యింది. నడక నేర్పించకనే నాయన పొయ్‌నాడు. పోతా పోతా వాళ్లు మిగిలించిన తోడూ లేదు. జానెడు బీడూలేదు. ఆకిలెరిగి ఏతల్లి అన్ని పాలు పట్టిందో. కడుపు చూసి ఏ చల్లని తల్లి అంత తిండి పెట్టిందో! నాకు బాగా బుద్ధి తెలిసే కుందికి నేనెక్కడున్నా? రెడ్డోరింట్లో సేద్దిగాడుగా కుదిర్నా!

కొంత కాలం రెడ్డోరి గేదెల్తో ఊరి గేదెల్ని కూడా జత చేర్చి వాటి తోక పట్టుకొని తిరిగినా. కురుకురు మీసం వచ్చీరాక ముందే రెడ్డోరి ఆవుల్ని తోలుకొని పరవగుట్టకు ఒక్క ఊపుమింద ఎలబార్నా. నా చూపు ఊపు చూసిన పడుచుదనం వగలుపడ్తే ఎలక్కాయంత గుండె గుమ్మడికాయంత అవతా ఉంటే ముసి ముసిగా నవ్వుకుణ్ణా!

మాఅమ్మ అందంగా ఉండేఉంటింది. అయ్యకూడా మెలితిరిగిన కండల్తో మొగలాయిలా ఉండేఉంటాడు. అందుకే నాకు అమ్మ అందమూ అయ్య కండలూ వచ్చి ఉంటాయి. ఈ కండల్ని చూసేకదా రెడ్డోరిణ్ణట్లో అంత తావిచ్చినారు. ఆ తావే దొరక్కపొయ్యుంటే నా బతుకు గాలికి కొట్టక పొయ్యే పుల్లాకే కదా. పోనీలే! అమ్మ అయ్య ఏమిచ్చి ఏమివ్వకుండా పొయ్‌నా కష్టపడేదానికి కండలైనా ఇచ్చినారు. లేకుండా ఉంటే రెడ్డోరింట్లో తావు దొరికేదంటే మాట్లా? పూర్వ జల్మంలో చేసుకున్న పున్నెమే ఈ జల్మలో ఇట్లా ఆదుకొంటా ఉండాదేమో?"

ఇలా ఆలోచిస్తా ఉంటే రాముడికి ఎంతో తృప్తి!

'రెడ్డీ మణిసే! రెడ్డి కొడుకులూ మణుసులే! వాళ్లంతా మల్లెపువ్వు మాదిరి గుడ్డలు తొడుక్కోని మట్టి చేతికంటకుండా తిరగతా ఉంటే నేనెందుకు కయ్యా కాలవల్లో బురదంతా పూసుకోవాల?'' అని వాడు యోచించలేదు. ఇల్లు వాకిలి లేదని, భూమీ పుట్రా లేదని వాడెప్పుడూ వాపోలేదు. ఎప్పుడైనా ఎగతాళిగా తమ్మిరెడ్డి 'ఇల్లు లేకపోతే పొయ్యింది ఇల్లాలైనా ఉండాలి గదరా' అని అంటే- 'ఆ పీకులాట నాకెందుకులే అయ్యా? తగిలించుకోని తనకలాడ్తా ఉండే వాళ్లను చూస్తానే ఉండా గదా! ఈ బతుకిట్లా గడిస్తే చాల్దా?' అని మాట మార్చేవాడు.

రెడ్డోరింట్లో ఒక మంద గొర్రెలున్నాయి. ఒక మంద మేకలున్నాయి. పది పన్నెండు బర్రెగొడ్లున్నాయి. ఇంకొక మంద ఆవులున్నాయి.

పాడికోసరం కాదు. రెడ్డిగారిన్ని జీవాల్ని భరిస్తా ఉండేది. పొలాల సత్తవకోసం. దుక్కి దున్ని కయ్యల్లో ఈ జీవాల్ని మందలుగా తోల్తే రాత్రిపూట అవి విసర్జించే మలమూత్రాలే కయ్యలకు ఎరువు. అయితే ఈ మధ్య వాన చినుకు నేలరాల్లేదు. మేపు లేదు. 'ఎట్లబ్బా ఇన్ని జీవాల్ని ఈ కరువు కాలంలో బరాయించేది?' అని మల్లగుల్లాలు పడ్తాఉంటే- 'మామా! మణుసుల రోగాలకు మందులు కనిపెట్టినట్లే మన కయ్యలకు కయ్యల్లో పైర్లకు మందులొచ్చేసినాయే! గోతాలకు గోతాలు అమ్మతా ఉండారు. మొన్న సిలమాకు పొయ్యుండి చిత్తూర్లో చూస్తి!' అని అన్నాడొక చిన్నోడు.

తమ్మిరెడ్డికి చిన్నోడి మాటమీద చింతాకంత సందేహం లేదు.

అందుకే వెనకా ముందు చూడకుండా గొర్రెల మందను, మేకల మందను కటిక రంగడోళ్లకు తగలకట్టాడు. అలాగే బర్రెగొడ్ల పీడ వదిలించుకొన్నాడు. ఆవుల్ని మాత్రం అపురూపంగా చూసుకుంటే చాలనుకున్నాడు. ఇంటి పాడికి!-కోడె దూడలు కాడికి!! కావాలి కదా అని.

అప్పుడు బుజ్జిగాడు రాముడి పాలబడ్డాడు.

ఒక గొర్రె సూటిది. ఈ పొద్దో రేపో ఈనేటట్లుగా ఉంది. ఏ పళానో ఏమో నామెక్కిన జొన్నకర్రను కొరికింది. అంతే! దినం మారకనే ఉబ్బిన పొట్ట మరీ ఉబ్బింది. ముచ్చటగా మూడు పిల్లల్ని నేలమీద పడేసి అది కన్ను మూసింది. నామెక్కిన జొన్నకర్ర విషం కంటే మరీ భయంకరమయింది. దాని ప్రభావం కడుపులో ఉన్న పిల్లలక్కూడా సోకినట్లుంది. పుట్టి నేలమీద పడుతూనే రెండు గుట్టెక్కిపోతే ఒక్కటి మాత్రం గండం గడిచి గట్టెక్కింది.

ఆ గొర్రెపిల్లను చేతికందుకొన్నాడు రాముడు. ముఖాన ముచ్చటగా చిన్న తమలపాకంత మచ్చ. పొడుగాటి చెవులు...ఒళ్లంతా లేత గోధుమ రంగు. మోకాళ్ల కింద నుండి మాత్రం ముదురు గోధుమ రంగు...మిలమిలా మెరుస్తూ నీలాలు పారే కండ్లు...బుజ్జితోక!... పెంటిదో? పోతో? చూశాడు. పోతే! మగ పుట్టుకంటే వాడిక్కూడా మోజుగా ఉంది. చిరునవ్వు పెదవుల మీద విరిసింది.

'నా బుజ్జీ!' అంటూ రాముడు దాన్ని గుండెలకు హత్తుకొన్నాడు.

గుండెలమీద మెత్తగా...అరమోడ్పు కన్నుల్తో అమాయకంగా...కొమ్మకు హత్తుకున్న ఉడతలా హత్తుకున్న బుజ్జిగాణ్ణి చూస్తుంటే రాముడి మనస్సు పరి పరి విధాల పోయింది.

"ఇట్లానే నన్ను గూడా నా తల్లి కని పారేసి కన్ను మూసుంటింది. అప్పుడు అయ్య అయినా నాకు తోడున్నాడు. నా బుజ్జి కెవరుండారు?"

రాముడి గుండె కదిలింది. కరిగింది. భారంగా నిట్టూర్చింది!

"ఒరే బుజ్జీ! ఇంక మిందట నేన్నీకు. నువ్వు నాకురా. ఏమంటావ్?" అన్నాడు రాముడు గోముగా.

'మె మె మె!' అనింది బుజ్జి.

"ఒరే పిచ్చినాయాలా! అప్పుడే మాట్లాడేది కూడా నేర్చుకుణ్ణావ్ కదరే!" అంటూ ముసి ముసిగా నవ్వాడు.

ఆరోజు నుండి తొక్కని గడప లేదంటూ తొక్కాడు. ఏ ఇంట్లో అయినా సరే! పాలిచ్చే గొర్రె కనబడితే చాలు. వెనక్కాళ్లకు బంధమేసి బుజ్జిగాడికి చన్ను కుడిపించాడు. తాను తినే సంకటిని చిన్న చిన్న ముద్దలుగా చేసి తినిపించాడు. తాను తాగే నీళ్లు తాపించాడు. పడ్తూ లేస్తూనే అది తెపురుకొనింది. నాలుగు పచ్చి కసువు పోసల్ని కొరికింది. రాముడి ఆనందానికి మేరలేదు.

ఆరోజునుండి ఈ రోజుదాకా కడుపున పుట్టిన బిడ్డమాదిర....కంటికి రెప్ప మాదిర... నీడలో నీడగా... తోడుకు తోడుగా...బుజ్జిగాడే తానుగా...తానే బుజ్జిగాడుగా ఒక బొందిలో ఇమిడిన రెండు ప్రాణాల్లా బ్రతికారు.

బతికితే ఇప్పుడేమయింది? ఏమవుతుంతో తలచుకుంటే రాముడి మనస్సు విరిగింది. మతి చెడింది. మొదలు నరికిన తరువులా తనువు కుప్పగా కొట్టంలో కూలింది.'పొద్దు కుంకితే ఎట్టబ్బా' అనుకుంటే పొద్దుకుంకనే కుంకింది. తెల్లారితే ఎట్టబ్బా' అనుకుంటే తెల్లారిపోతింది. తెల్లారి పోతే ఎట్లబ్బా? అనుకొంటూ కాళ్ళెత్తి కడుపులో పెట్టుకొని ముడుక్కొన్నాడు రాముడు.

జామురాత్రి కావస్తూ ఉంది.

"ఏమిరా రాముడూ? ఊరంతా ఒక దారైతే ఉలిపికట్టెదొక దారన్నట్లుంది గదరా యవ్వారం. ఒంటి మీద గుడ్డ నిలవకుండా ఊరు ఊరంతా ఊరేగతా ఉంటే నువ్వేందిరా మూలకి పొయ్ ముడుక్కున్నావ్? లెయ్‌రా లెయ్. లేసి అంత తినేసి పొణుకోరా,అంతగా అలిసి పులిసి పొయ్యుంటే" అని రెడ్డమ్మ రాగాలు తీసింది.

ఉన్నట్లుండి మోయలేనంత బరువు నెత్తిన పడ్తే...అనుకోనట్లుగా నడుములు విరిగిపోతే...లేవలేనంత బరువుగా లేచాడు. రెడ్డమ్మ మర్నాడు ముత్యాలమ్మకు పెట్టారంటే ఆపూట గంగమ్మకుపెట్టింది. రాముడికి నాలుగు కూరల్తో కూడు వడ్డించింది.

రాముడికి ముద్ద మింగుడు పడలేదు.

కోడి కెలికినట్లు కెలుకుతున్నాడు.

గమనించింది రెడ్డమ్మ!

"ఆ కోడి కెలుకుళ్లేందిరా రాముడూ? అవున్లే! రెండు పూట్లన్నా కడుపు ఎండ గట్టక పోతే రేపు పొట్టేలి తునకల్తో ఈ వారిడి ఆ వారిడి లాగించేదెట్లా?"

రాముడి పంటికింద కందిగింజంత రాయి పడింది.

'ఈపొద్దు కందిగింజంత రాయి. రేపు పాణంలో పాణం బుజ్జిగాడి ఎమిక!' రాముడి ఒళ్లు జలదరించింది.

ఆకలి చచ్చిపోయింది. ఎంత ప్రయత్నించినా ముద్ద మింగుడు పడలేదు. అటు ఇటు చూశాడు. రెడ్డమ్మ ఇంట్లో ఉంది. తటాలున తింటున్న ఆకును రెండు చేతుల్తో జవురుకొన్నాడు. నేరుగా బుజ్జిగాడి దగ్గరికి నడిచాడు. ఆకును దాని మూతి ముందర పెట్టాడు. అది రాముడి మొగాన్ని పరిశీలించి చూసింది. ఆ తరువాత ఆకువైపు చూసింది. ఆ తర్వాత ఏదో అర్థమైనట్లుగా విదిలించి కొట్టింది. రాముడి కండ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి. గిరక్కున వెనక్కు తిరిగాడు. వీధి వాకిట్లో ఆకును విసిరేశాడు. వీధి కుక్కలు ఆకుటి కోసం కాట్లాడుకొంటున్నాయి. రాముడు ఇంట్లో అడుగు పెట్టేటప్పటికి రెడ్డెమ్మ చెంబు నీళ్లు చేతపట్టుకొని నిలబడి ఉంది. రెడ్డమ్మ నీళ్లు పోసింది. రాముడు చేతులు కడుక్కొన్నాడు. కడిగిన చేతుల్ని దోసిలిపట్టి రెడ్డెమ్మ పోసిన నీళ్లతో కడుపు నింపుకొన్నాడు. మారుమాట్లాడకుండా వెళ్లి పడుకొన్నాడు.

పడుకొన్నాడేకానీ కంటిమీద రెప్ప పడలేదు.

అటుపొర్లతాడు. ఇటుపొర్లతాడు. కాసేపు కాళ్లెత్తికడుపుల్లోపెట్టుకొని ముడుక్కొంటాడు. ఎంత ప్రయత్నించినా నిద్ర మాత్రం దరిదాపులకు రానంటూ ఉంది. బుజ్జిగాడి మీద ఆలోచనలు దూరం కానంటూ ఉన్నాయి.

దాదాపు అర్ధ రాత్రి కావస్తూ ఉంది. తిరణాల హడావిడిలో అలసి సొలసిన ఊరు గురకపెట్తూ ఉంది. ఎక్కడో ఒక తీతువు భీకరంగా అరుస్తూ ఉంది. ముత్యాలమ్మ గుడి పందిరికింద అలంకరించిన పువ్వుల్లా ఆకాశంలో నక్షత్రాలు మిల మిలా మెరుస్తున్నాయి.

రాముడు లేచి కూర్చున్నాడు.

గుండెల సుడిగుండంలో బండ పడినట్లయింది. అలలు అలలుగా ఆలోచనలు.

"సగం రేత్రి గడ్సి పొయ్యింది. ఇంక సగం రేత్రి గడ్సిపోతే తెల్లారిపోతింది. తెల్లార్తే పొద్దు నడిమిట్ట కొస్తే...నడిమిట్ట కొచ్చిన పొద్దు వాటార్తే బుజ్జిగాణ్ణి నిలవనా ముత్తేలమ్మకు బలిచ్చేస్తారు."

రాముడి గుండె గ్రద్ద తన్నును తప్పించుకొన్న కోడిపిల్ల మాదిరి విలవిలలాడింది.

అయినా ఏం చేస్తాడు? ఏడాదిగా బుజ్జిగాడి మమతను సొంతం చేసుకో గలిగాడే కానీ బుజ్జిగాడు సొంతం కాదు కదా?

పిడికెడు కసువు దాని నోటికందించినపుడే వాడికి తెలుసు-ఆ కసువు కండగా

మారుతుందని! ఏ నాటికో ఒక నాటికి పంటికింద పడుతుందని!! అయినా ఈపూట వాడా ఊహనే భరించలేకుండా ఉన్నాడు.

ఎలా భరిస్తాడు?

అది ఒకనాటి అనుబంధం కాదు మరిచిపోవడానికి?-తెంపితే తెగిపొయ్యేదానికి! అది ఏడాది అనుబంధం!

తనకొక ముద్దుల మేనకోడలంటూ ఉంటే ఆ పిల్ల దానికి ముక్కుకు ముక్కర, కాళ్లకు గజ్జెలపట్టెడ నడుముకు వడ్డాణం కోరి కోరి కొని పెట్టినట్టుగా రాముడు బుజ్జిగాడి మెడకు గజ్జెల పట్టెడ...నడుముకు వెంట్రుక దారం...కొమ్ములకు గజ్జెల ఉంగరాలు మోజుతీరా తగిలించాడు. గజ్జల గుర్రం కదను తొక్కినట్లు అది నడుస్తుంటే తృప్తిగా మీసం మెలేశాడు.

బుజ్జిగాడు కూడా ఒక్క క్షణం రాముణ్ణి వదిలి ఉండేది కాదు. వాడు మోట కట్టేదానికి తొలి కోడి కూతతో లేస్తే అది కూడా ఎవరో తట్టి లేపినట్లు లేచేది. వాడు బయలుదేరితే అది వెంటపడేది. వాడు పదం పాడుతూ కపిల తోలుతూ ఉంటే అది ముంగాళ్లు ముందుకు చాపి ఆ కాళ్ల మీద తలను మోపి ఆలకిస్తూ పడుకొనేది. 'బుజ్జీ! ఆ పారట్లా అందుకోరా!!' అంటే అతి చాకచక్యంగా కొమ్ముకు తగిలించుకొని తెచ్చేది.

ఎప్పుడైనా సరే రాముడు సంకటి ముద్ద చేతిలో పెట్టుకుంటే తొలి కవళం తనకు పెడ్తేనే కానీ తిననిచ్చేది కాదు.

ఒకరోజు రాత్రి, రాముడు మందకాడ కావలి పడుకొని ఉన్నాడు. బుజ్జిగాడు పక్కలోనే ముడుక్కొని ఉన్నాడు. ఉన్నట్టుండి సగంరాత్రివేళ రాముణ్ణి డొక్కల్లో ఒక్క కుమ్ము కుమ్మింది. అదిరిపడ్డాడు రాముడు...

'ఏమి దీనికొచ్చిన రోగం!' అని విసుక్కొంటూ లేచాడు. బారెడు పొడుగు నాగుపాము. నాలుగు బార్ల దూరంలో పడగవిప్పి ఆడుతూ ఉంది. గొర్రెలూ, మేకలూ బిత్తరపడి అరుస్తున్నాయి! రాముడికి కాలూ చెయ్యీ ఆడలేదు. కదిలి మెదలకుండా ఊపిరి బిగపట్టి రెప్పార్చకుండా చూస్తూ చేతులు జోడించాడు. పాము తన దారిన తాను వెళ్లిపోయింది!

అయినా రాముడికి అదురు తగ్గలేదు. ఆ మరునాడు వాడికి జ్వరం కూడా తగిలింది. పైకి లేవలేక వాడు కొట్టంలో పడకేస్తే బుజ్జి వాడి పక్కనే ముడుక్కొనింది.

రాముడు లేచి తిరిగే దాకా అది కసువు పోచ కొరికుంటే ఒట్టు!

"ఊల్లేదు!...బలిచ్చే దానికీల్లేదు!" గొంతు చించుకోలేదు కానీ మనిషికి జంతువుకి మధ్య మమకారం తిరుగులేని నిర్ణయం తీసుకొనింది. చివుక్కున పైకి లేచాడు. చరచరా బుజ్జిగాడి దగ్గరికి నడిచాడు. రాముడి రాకను గమనించి అది ఎగిరిపడి లేచింది.

రాముడు బుజ్జిగాడి పగ్గాన్ని విప్పి చేత పట్టుకొన్నాడు. ఆ అపరాత్రిలో అది వాడి వైపు అయోమయంగా చూస్తూ ఉంది. వాడదేమీ గమనించే స్థితిలో లేడు. అడుగుమీద

అడుగ్గా ఇల్లు దాటి వీధిన పడ్డాడు. కుక్కలు పసిగట్టాయి. మొరగడానికి మోరలుపైకెత్తి రాముడిని గమనించి పొత్తిళ్లలో కృష్ణుణ్ణి నెత్తికెత్తుకొన్న వసుదేవుడికి సముద్రుడు సాగిలపడి దారి ఇచ్చినట్టు తోకలు ముడుచుకొంటూ తొలిగిపోయాయి! కన్ను పొడుచుకున్నా కనిపించని చీకటి. ఆ చీకట్లో రాముడిది పరుగులాంటి నడక. బుజ్జిగాడిది నడకలాంటి పరుగు!

రాముడు నడక పరుగ్గా నడిచి నడిచి పరవగుట్ట దరిదాపులకు చేరుకొన్నాడు. ఇంక నడవలేనన్నట్టుగా అక్కడ చతికిల పడ్డాడు. దాదాపు కోడికూసే వేళ అయినట్లుంది. రాముడు కూర్చునే సరికి బుజ్జిగాడు వాడి పైన బడినట్టుగా ముదిగారంగా మూతిలోమూతి పెట్టి 'ఏమిటిదంతా?' అనిఅడిగినట్లుంటే రాముడు రెండు చేతుల్తో వాణ్ణి వాటేసుకొన్నాడు. నిద్రపోతున్న పరవగుట్ట మేలుకొని కరుణా పూరితమైన వాడి గోడు వినడానికి గుండె దిటవు చేసుకొని నిశ్చలంగా నిలబడి ఉంది. బుజ్జిగాడి మూతి నిమురుతూ...కండ్లల్లో కండ్లు పెట్టి చూస్తూ...మాటలు కూడ పలుక్కొన్నాడు.

"ఒరే బుజ్జిగా!ఈ పొద్దు నిన్ను ముత్తేలమ్మకు బలిచ్చేస్తార్రా! పొద్దు గూట్లో పడీ పడక ముందే నిన్ను నోట్లో యేసుకోవాలని ఆయాలాయాలుగా కోసేస్తార్రా! ముత్తేలమ్మకు నీ నెత్తురు కావాల. పుర్సత్వం జాస్తి అవుతుందని రెడ్డికి నీ సేరు కావాల. గుండె లేకపోయినా రెడ్డమ్మ గుండెకాయంటే కొట్టకలాడ్తుంది. రెడ్డి కొడుకు పెద్దోడుండాడే? మెదురంటే పాణం. సిన్నోడు గోడదబ్బ కావాలని దెబ్బలాడ్తాడు. మిగిల్నె సియ్యకు ఉప్పు పసుపేసి ఎండబెట్టి ఉప్పాసులు చేసుకుంటారు! నా చేతల మీద నిన్ను పెంచినా. నాకండ్ల ముందర్నే నిన్ను కత్తికి కండచేస్తా ఉంటే ఎట్లా చూడమంటావురా! నా వల్ల కాదురా బుజ్జీ! నా వల్ల కాదు!"

కంటికి మింటికి ఏడుపు ధారవేస్తున్నాడు రాముడు!

నోరులేని జీవం. వాడి బాధను అర్థం చేసుకొన్నట్లుగా వాడి చూట్టూ తిరుగుతుంది. నేలమీద పడి పొర్లాడుతుంది. అంతలోనే పైకి లేచి కన్నీటిని మూతితో తుడుస్తుంది! "అయితే నన్నేం చెయ్‌మంటావ్?" అన్నట్టుగా తల ఆడిస్తుంది.

"ఎల్లిపోరా బుజ్జీ! నా కంట్లో పడకుండా ఎల్లిపోరా! సాకి సంతరించి నిన్ను చట్టిలో ఏసుకునే మణుసులకు దూరంగా పారిపోరా! పోరా! బుజ్జీ పోరా!"

"పోతాను. నువ్వెట్లా చెప్తే అట్లా పారిపోతాను. అయితే ఈ అడివిలో ఏ సిర్తపులో, పెద నక్కో నన్ను నోట్లో యేసుకొని నంజుకుంటే?" అన్నట్లు దీనంగా చూసింది బుజ్జి.

"నా కంటికిమరుగ్గా నువ్వేమైపాయ్‌నా నాకు బాదలేదు. పోరా పో! నాకట్టె రెడ్డోరింటికి కట్టుబణ్ణా నా మణుసు నీ ఎంటుంటింది పోరా!"

బుజ్జిగాడికి ఈమాటలు చెవికెక్కలేదు. అటుపోతింది. ఇటు పోతుంది.పోలేక మళ్లీ వచ్చి పాదాల ముందు మూతి పెట్టి పడుకొంటుంది. "ఒరే బుజ్జీ పారిపోరా!" అంటే నావల్ల కాదన్నట్లుగా తల అడ్డంగా తిప్పుతుంది.

రాముడు గుండె రాయి చేసుకొన్నాడు.



8.

అటు ఇటు చూసి ఒక బెత్తాన్ని చేతికందుకొన్నాడు. ఎప్పుడు తమాషక్కూడా దానిమీద చేయి చేసుకోని మనిషి. చెడామడా బాదాడు. రాముడి వైపు ఒక్క చూపు చూసింది బుజ్జి కోపంగా... దీనంగా....ఆ మీదట తప్పదన్నట్లు పరుగందుకొనింది.

కండ్లల్లో కట్టలు తెంచుకొన్న గుండెతో రాముడు, కుప్ప కూలాడు. ప్రకృతి మాత వొడిలో.. ప్రశాంతమైన పరవగుట్ట దడిలో... కొన్ని క్షణాలు ...క్షణాలు గడిస్తే కొన్ని నిముషాలు. మెల్లగా పైకి లేచాడు. బుజ్జిగాడు కనుచూపు మేరలో కనిపించ లేదు. ఎగ్గొట్టుకొస్తున్న ఏడుపును దిగమింగుకొంటూ వెనక్కు తిరిగాడు.

ఆత్మీయత... బాధ్యతల మధ్య సంఘర్షణ! ఆత్మీయత వెనక్కూ... బాధ్యత ముందుకు... వీటి మధ్య ఇరుక్కొని మనిషి వెనక్కూ ముందుకు ఊగుతూ... ఆత్మీయత చేతి బెత్తం దెబ్బ తిన్న గుండె కుములుతుంటే...అడుగులు భారంగా ముందుకు ... బాధ్యతను గుర్తుచేస్తూ-

పశువుల కొట్టంలో పడుకొన్నాడు. తూర్పున పటమెగిరింది!

తెల్లారింది!

అంతకు మునుపే నిద్ర లేచిన రెడ్డమ్మ తలంటి స్నానం చేసింది. భోషాణంలోని పట్టుచీరను తీసి కట్టుకొనింది. పొంగలి గంపను అమర్చడంలో హడావిడి పడ్తూ ఉంది.

పొంగలి గంప కంట పడేసరికి రెడ్డిగారి మనసులో పొట్టేలు మెదిలింది.

రాముడు మేపిన పొట్టేలు...తవుడు గానుగపిండి, పచ్చికసువు, నిలుపు లేకుండా పెట్టి పుష్టిగా మేపిన పొట్టేలు...ఎక్కడ పట్టుకొంటే అక్కడ పిడెకెడు కండ చేతికి దొరికేటట్లు రాముడు మేపిన పొట్టేలు!...

తమ్మిరెడ్డి గుండెల్లో తృప్తి చిరునవ్వు మొలకలైతే పెదవులు వ్రటసుడులయ్యాయి. కాలు ధీమాగా పైకి లేచి ముందుకు పడింది. కొట్టంలో ఆగింది.

పొట్టేలు కనిపించలేదు!

రెడ్డిగారు సందేహంగా అటు చూశాడు. ఇటు చూశాడు. ఎక్కడా కనిపించక పోయేసరికి గబగబ యింటి వెనక్కువెళ్లాడు. అక్కడ కూడా లేదు. ఆశ్చర్యం, సందేహం, ఆరాటం ముప్పిరిగొన్నాయి. తిరణాల మనస్సులో మెదిలి ముచ్చెమటలు పోశాయి.

"రాముడూ!" అని ఒక్క గావు కేక పెట్టాడు.

ఆ కేకతో ఇల్లు దద్దరిల్లింది. ఇంటి ఇల్లాలు రెడ్డెమ్మ ఉలిక్కిపడింది.

రాముడు మాత్రం అడుగులో అడుగ్గా వచ్చి ఎదుట నిలబడ్డాడు.

"పొట్టేలెక్కడ్రా?" గద్దించాడు రెడ్డి.

రాముడు వంచిన తలెత్తలేదు.

"అడగతావుంటే అరీ గురీ మనకుండా బెల్లంకొట్టిన రాయి మాదిరుండావే? ఎక్కడ్రా పొట్టేలి?"

రాముడు ఒక్కసారి మెల్లగా తల పైకెత్తి తటాలున వంచుకొన్నాడు.

దైన్యం గూడుకట్టిన కండ్లను రెడ్డిగారికి చూపడానికి ధైర్యం చాలలేదు.

"నిన్నేరా అడగతా ఉండేది. చెవల్లో చెట్లేమన్నా మొల్సినాయా?"

నిలువు రాయిలా నిలబడిన రాముడు కదిలీ మెదల్లేదు.

"ఎంత దిమాకురా నీకు దిక్కులేన్నా కొడకా!...చెరుకా బెల్లం పెట్టంటే పెడ్తుందా?" రెడ్డి మునికోల చేతికందుకొన్నాడు.

"చెప్పరా! పొట్టేలేమయిందో చెప్పరా? నిన్ను గాదని అది యాడికి పోతిందిరా? చెప్పు. చెప్తావా! లేదా?"

మాట ముగిసీ ముగియక ముందే మునికోల పైకి లేచింది. దెబ్బ మీద దెబ్బ. చర్మం చిట్లుతూ ఉంది. చిట్లిన చర్మంలో నుండి రక్తం చిప్పిలుతూ ఉంది.

రాముడు 'అమ్మా!అయ్యో!' అంటున్నాడే కానీ అడిగిన దానికి బదులు చెప్పలేదు.

పెద్దింటోళ్ల బలే తక్కవయిందని కోపగించిన ముత్యాలమ్మ ఆవహించినట్లుగా క్షణ క్షణానికీ తెగ రెచ్చిపోతున్నాడు రెడ్డి. విచక్షణా రహితంగా మానవతకు మసిపూసి గొడ్డును బాదినట్లు బాదుతున్నాడు.

పేగు తెంచుకొని పుట్టిన ఆడ సంతానాన్ని ఎప్పుడో పుట్టబోయే మగ సంతానం కోసరం కాళీ మాతకు బలి పేరుతో త్యాగం చేస్తున్న తల్లులున్న ఈ పవిత్ర భారతదేశంలో నాలుగు కసువు పోసలేసి ఎవ్వడో పెంచిన పొట్టేలి పిల్లను త్యాగం చేయలేని రెడ్డి రాముణ్ణి కుక్కను కొట్టినట్లు కొడుతున్నాడు.

ఆ తనువులో ఎక్కడున్నాయో? ఎలా ఉన్నాయో? అన్ని నీళ్లు! కరుణలేని గుండెముందు రాముడి కండ్లు కరిగిన మేఘాలయ్యాయి!

మనిషికీ మనిషికి మధ్య మమతానురాగాలు మహా కావ్యాలైతే ఒక మూగ జీవం మీది మమత కన్నీరై పుడమి తల్లి గుండెల మీద పడి ఇంకిపోతూ ఉంది-కావ్య వస్తువు కాలేక!

మునికోల కోపు తగ్గలేదు!!

అయినా రాముడు నోరు విప్పలేదు. అది మూగపోయింది మరబొమ్మగా మార్చేసిన అధికారంతోనో మూగ జీవం మీది మమకారంతోనో!-

బుద్ధుడు పుట్టిన దేశంలో...మనిషిని మనిషే మాటువేసి చంపే సమయంలో ఆస్తిపాస్థులు అంతస్తులతోపాటు కరుణ దయాదాక్షిణ్యాది గుణాలు కూడా కలిగినోళ్ల పరమైనట్లుంది!...అవి ఒక మాలోడి గుండెల్లో చేరి 'అంటు' పేరుతో మైల పడ్డాయి!

అయితే అయినదానికి కానిదానికి తిరునాళ్లు జరిపించుకొనే నోరులేని ముత్యాలమ్మ సాక్షిగా ఏ గుండెల్లో మైల?-

బుద్ధం శరణం గచ్ఛామి!!! ధర్మం శరణం గచ్ఛామి! సంఘం శరణం గచ్ఛామి!!

- ఆంధ్రపత్రిక **(7-11-1986)**

**(దీపావళి కథల పోటీలో ప్రథమ బహుమతి)**